క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో మహాలక్ష్మినగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంతనగర్, విష్ణుపురంకాలనీ, సాయినగర్, బందరు రోడ్డు, లక్ష్మిపురంకాలనీ, గద్దె ఆర్టీసీ కాలనీ, రంగా బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



పెనమలూరు: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ అన్నారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. లైసెన్సు, వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పని సరిగా ఉండాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాడిగడప జంక్షన్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహించారు.

రేపు ఆక్యుప్రెజర్‌పై ఆరోగ్య శిక్షణ

పెనమలూరు: ఈ నెల 30వ తేదీ ఆదివారం ఆక్యుప్రెజర్‌పై ఆరోగ్య శిక్షణ ఇస్తామని యోగా శక్తి సాధన సమితి చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానూరు అశోక్‌నగర్ ఇండియన్ ఓం కార్యాలయంలో 30న ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒక రోజు శిక్షణ ఉంటుందన్నారు. ఎవరి ఆరోగ్యం వారే నయం చేసుకునే విధంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెజర్, యోగాశక్తి చికిత్సపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

బాపట్ల రవికి అంబేడ్కర్ జాతీయ అవార్డు



గన్నవరం: స్థానిక స్రవంతి హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాపట్ల రవిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభ అవార్డుకు గుంటూరు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్‌పీఎల్‌టీఓ) ఎంపిక చేసింది. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏప్రిల్ 13న గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే వేడుకల్లో రవిని ప్రతిభ పురస్కారంతో ఎస్‌పీఎల్‌టీఓ ప్రతినిధులు సత్కరించనున్నారు. అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికైన రవిని పాఠశాల ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ధర వ్యత్యాసం ప్రకటించడం హర్షణీయం

కంకిపాడు: కృష్ణామిల్క్ యూనియన్ 2024-25 సంవత్సరానికి గానూ మూడో విడత ధర వ్యత్యాసం ప్రకటించడం హర్షణీయమని విజయ ట్రస్టు బోర్డు సభ్యుడు జొన్నల హరి కోటిరెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు పాల కేంద్రం ప్రాంగణంలో శుక్రవారం ఉయ్యూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల్లోని పాల కేంద్రాల సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. హరి కోటిరెడ్డి మాట్లాడుతూ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, పాలకవర్గ ప్రతినిధులు పశుపోషకులకు అండగా నిలుస్తున్నారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ మూడో విడతగా డిసెంబరు-మార్చి వరకూ పాడి రైతులకు పది పైసలు ధర వ్యత్యాసం ప్రకటించారన్నారు. పాల సేకరణ ధరను లీటరుకు రూ. 80 నుంచి రూ. 82కి పెంపుదల చేసినప్పటికీ రూపాయికి పది పైసలు ధర వ్యత్యాసం అందించి పాడి రైతులకు బాసటగా యూనియన్ నిలవడం సంతోషకరమని పేర్కొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు: కానూరు సనత్‌నగర్ వద్ద సీఆర్డీఏ నిధులు రూ. 2.70 కోట్లతో 80 అడుగుల రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానూరులో 80 అడుగుల రోడ్డుతోపాటు మహానాడు రోడ్డు నిర్మాణం, పంటకాలువ కానూరు నుంచి పోరంకి వరకు విస్తీర్ణం చేస్తామన్నారు. అలాగే కానూరులో డ్రెయినేజీల నిర్మాణం కూడా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ పీ భవానిప్రసాద్, నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు, దోనేపూడి రవి, షేక్ బుజ్జి పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. మురుగునీటి తటాకాలు

- పొలాల్లోకి ఎగదన్నుతున్న మురుగునీరు
- పంట దిగుబడులపై ప్రభావం
- గగ్గోలు పెడుతున్న రైతులు



మురుగునీటితో ఖాళీ స్థలాలు



డ్రెయినేజీ నుంచి ఖాళీ స్థలాల్లోకి చేరుతున్న మురుగునీరు

కంకిపాడు: ఖాళీ స్థలాలను మురుగు ముంచెత్తుతోంది. అక్కడితో ఆగకుండా సమీపంలోని పొలాల్లోకి ఊట దిగుతోంది. దీంతో పంట దిగుబడులపై ప్రభావం పడుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మురుగునీరు యథేచ్ఛగా పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నా అధికారులు ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్ పరిసరాల్లో వ్యాధుల భయం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కడ చూసినా మురుగే

కంకిపాడు బైపాస్ మార్గానికి ఆనుకుని ఉన్న అనుబంధ రహదారి మార్గం గుండా గాయత్రీ విహార్ ప్రాంతం ఉంది. ఇక్కడ గేటెడ్, అపార్టుమెంటు సముదాయాలు, ఫంక్షన్ హాలు సైతం ఉన్నాయి. అయితే కొద్ది రోజులుగా ఈ ప్రాంతాన్ని మురుగు సమస్య వెంటాడుతోంది. డ్రెయినేజీల నుంచి మురుగు పారుదల కాకుండా సమీపంలోని పొలాలు, ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. పరిసరాలు మురుగునీటి తటాకాలుగా మారిపోతున్నాయి. రోజుల తరబడి మురుగు నిలిచి ఉండటంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా తయారైంది. ప్రశాంత



అధ్వానంగా తయారైన గాయత్రీ విహార్ పరిసరాలు

వాతావరణంలో నివాసం ఉండొచ్చని భావించి ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని, అద్దెకు ఇళ్లు తీసుకుని నివసించే ప్రజలు ప్రస్తుతం మురుగుతో వెలువడే దుర్గంధం, దోమల విజృంభణతో కంటి మీద కునుకు కరువై జీవనం సాగిస్తున్నారు. గాయత్రీ విహార్ పరిసరాలు మొత్తం మురుగునీటి తటాకంగా మారిపోయి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు.

ఆందోళనలో రైతులు

ఖాళీ స్థలాలను ముంచెత్తుతున్న మురుగు సమీపంలోని పంట పొలాల్లోకి సైతం ఊట దిగుతుండటంతో, పంట దిగుబడులపై ఆందోళన చెందిన రైతులు ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ వీ భావనారాయణ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. మురుగునీటితో తలెత్తుతున్న సమస్య వాస్తవమేనని గుర్తించారు. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు నోటీసులను సిద్ధం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

మురుగు సమస్య పంచాయతీ దృష్టిలో ఉంది. రైతుల ఫిర్యాదుతో రెవిన్యూ అధికారులు చూసి వెళ్లారు. మేము కూడా పరిశీలన చేశాం. మురుగు ఎక్కడి నుంచి వస్తుందీ? తెలుసుకుని బాధ్యులకు నోటీసులు అందేలా చూస్తాం. మురుగు వల్ల ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి

కార్మిక శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్

ఉయ్యూరురూరల్: కార్మిక శాఖ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా ఉయ్యూరు అసిస్టెంట్ లేబర్ కార్యాలయ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని మచిలీపట్నం-1 యూనిట్ ఏఎల్‌ఓ సీహెచ్ రత్నకుమార్ తెలిపారు. ఉయ్యూరు పరిధిలో శుక్రవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను పూర్తిస్థాయిలో అమలు పరచని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే ఉయ్యూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి ఒకటి నుంచి మార్చి 31వ తేదీ వరకు ఈ తనిఖీలు నిర్వహించి చట్టాలను పూర్తిస్థాయిలో అమలుపరచని యాజమాన్యాలను తక్షణమే అపరాధ రుసుం వసూలు చేస్తున్నామన్నారు. కనీస వేతన చట్ట ప్రకారం షాపుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు రూ. 12 వేలు నెలవారి



ఉయ్యూరులో తనిఖీలు చేస్తున్న కార్మిక శాఖ అధికారులు

వేతనం అందించాల్సి ఉండగా కొందరు యాజమాన్యాలు కేవలం రూ. 8 వేలలోపు ఇచ్చి ఇతర చట్టాలు అమలు చేయడం లేదన్నారు. అలాంటి సంస్థలను స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక తనిఖీల్లో ఉయ్యూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమాదేవి, వాసవ్య మహిళా మండలి ప్రతినిధి రమ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్‌పర్సన్ నరెడ్ల శైలజ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శుక్రవారం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీ ట్రాన్స్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ వై.కేశవాచార్యులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల సాధించిన ప్రగతి, అకడమిక్ వివరాలు తెలియజేశారు. సెప్టెంబర్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ, ఎస్. సత్యనారాయణరెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వికాస్ కళాశాల యాజమాన్యం

బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.గోపాలకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

- బందరు కాలువ కట్టపై శాశ్వత నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

పెనమలూరు: సాగు నీరు, తాగునీరు అందిస్తున్న బందరు కాలువ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మండల పరిధిలో ఇప్పటికే ఆక్రమణలతో బందరు కాలువ కట్ట దారుణంగా మారగా, తాజాగా మరిన్ని ఆక్రమణలకు తెరలేపారు. వివరాల్లోకి వెళితే.. పెనమలూరు వంతెన వద్ద కాలువ కట్టపై ఖాళీ స్థలం ఉంది. గతంలో ఇక్కడ కాలువలోకి దిగడానికి ర్యాంప్ ఉండేది. అయితే గ్రామంలో కొందరు ఈ ప్రాంతంలో గుడి నిర్మాణం చేయాలని మట్టితో కాలువ పూడ్చి వేశారు. ఇప్పటికే బందరు కాలువ కట్టపై గుడులు, మసీదులు, ప్రార్థనా మందిరాలతో పూర్తి ఆక్రమణ అయింది. తాజాగా వంతెన దిగువన కాలువ కట్ట ఆక్రమించి గుడి నిర్మాణం చేయాలని యత్నిస్తున్నారు. అలాగే వంతెనకు మరో పక్క కాలువ కట్టపై ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేస్తున్నారు. బందరు కాలువ ఇప్పటికే మురుగు నీరు, వ్యర్థ పదార్థాలతో దారుణంగా మారింది. బందరు కాలువ కట్టపై శాశ్వత కట్టడాలు చేయడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉంది. ఆక్రమణలు



బందరు కాలువ కట్టపై ఆక్రమించిన స్థలం

ఇలాగే కొనసాగితే ఇక భవిష్యత్తులో బందరు కాలువనే అదృశ్యమయ్యే ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళణ చెందుతున్నారు.

అధికారులు ఎక్కడ..?

బందరు కాలువ గట్లు ఆక్రమణలకు గురవుతున్నా అధికారుల జాడ మాత్రం కనబడటం లేదు. నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా ఉండటంతో బందరు కాలువ కట్టలు ఆక్రమణల పరంపరలో ఉంటున్నాయని రైతులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర మత్తు వదిలి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలికల రక్షణ కోసమే పోక్సో చట్టం చేశారని, అనేక నగరాల్లో ఈ చట్టం అమలుకు జిల్లా కోర్టులు ఉన్నాయని సీనియర్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం గవర్నర్‌పేటలోని ఐఏసీఈ నందు వాసవ్య మహిళా మండలి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మచిలీపట్నం వారి సౌజన్యంతో పోక్సో చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బాధిత పిల్లలు నష్టపరిహారం పొందవచ్చన్నారు. చిన్నారులు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

వివాహ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల సమాచారం మీలో ఎవరికైనా తెలిస్తే 1098, 112 అనే చైల్డ్ హెల్ప్ లైన్, టోల్ ఫ్రీ నంబర్లకు తెలియజేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సదస్సులో వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధిక అశోక్, లీగల్ ఎడ్వైజర్ పిట్టల గోవింద్, పగిడపల్లి రాము పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై దాడి

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో ఆర్‌ఎంపీ వైద్యుడిపై పలువురు దాడి చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ జె.వెంకటరమణ కథనం మేరకు.. సనత్‌నగర్ పెద్ద మసీదు కాంప్లెక్స్‌లో సయ్యద్‌షావుల్ హమీద్ హుస్సేన్ ఆర్‌ఎంపీ వైద్యుడిగా వైద్య సేవలు అందిస్తున్నాడు. అతని వద్ద చికిత్స చేయించుకునే పేషెంట్లకు పక్కనే ఉన్న కరీం మెడికల్ షాపునకు వైద్యుడు మందులు రాసేవాడు. అయితే గత కొద్ది నెలలుగా వైద్యుడు హుస్సేన్ తక్కువ ధరకు మందులు ఇచ్చే వేరే షాపునకు రాస్తున్నాడు. ఈ నేపథ్యంలో వైద్యుడు హుస్సేన్‌పై కరీం మనుషులు ముస్సర్‌ఆలి, జాకీర్, సాధిక్, మరి కొందరు దాడి చేశారు. ఈ ఘటనపై కరీం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై బ్లేడుతో దాడి

పెనమలూరు: పోరంకిలో మహిళపై బ్లేడుతో దాడి చేసిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. పోరంకి బీజేఆర్‌నగర్‌కు చెందిన బందెల కుషలు పట్ల గత 2020లో అదే ప్రాంతానికి చెందిన కొమరవల్లి వర్ధన్ అసభ్యంగా ప్రవర్తించాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కోర్టులో ఉంది. కాగా గురువారం వర్ధన్ వచ్చి తన కుటుంబ సభ్యులతో మాట్లాడాలని కుషలును పిలిచాడు. వర్ధన్ పెదనాన్న దేవిడ్‌రాజు, తల్లి విజయనిర్మల, తండ్రి చంటి గతంలో పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలని ఆమెను కోరారు. తన కుటుంబ సభ్యులతో మాట్లాడమని ఆమె సమాధానం చెప్పింది. దీంతో ఆగ్రహించిన వర్ధన్ బ్లేడుతో ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి తూర్పుపేటకు చెందిన బీఫార్మసీ విద్యార్థిని వేమూరి వైసామృతకు చదువు నిమిత్తం ఉపసర్పంచి జాస్తి శ్రీధర్‌బాబు రూ. 30 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ చదువుకు దూరం కాకుడదని వైసామృత కుటుంబ పరిస్థితి తెలుసుకుని ఆర్థిక సాయం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకువచ్చిన శ్రీధర్‌బాబును అభినందించారు. దాతల సహకారాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఎంపీటీసీ సభ్యుడు శొంతి కిషోర్, గ్రామ ప్రముఖులు రాజుల పాటి శ్రీనివాసరావు, వీరబాబు, కెల్లా రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రామాలయంలో ఉగాది వేడుకలు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీన శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు ఎస్ రామాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున స్వామివారికి విశేష అర్చనలు అనంతరం ఉదయం తొమ్మిది గంటలకు పావన మురళీకృష్ణశర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఏలూరు కాలువను ఆధునికీకరించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏలూరు కాలువ ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కృష్ణా తూర్పు డెల్టా డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీ ఆంజనేయ ప్రసాద్‌ను విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏలూరు కాలువ ఆయకట్టుదారుల సమస్యలను వివరించి, గుర్రపు డెక్కను తొలగించాలని, ఎనికేపాడు వద్ద బుడమేరు అండర్ టన్నెల్ వెడల్పు చేయాలని కోరినట్లు తెలిపారు. కాలువ కట్టలు తెగకుండా బలోపేతం చేయాలని, నీటి నిర్వహణ సామర్థ్యాన్ని పెంచాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. పెరికీడు-1, 2 డ్రెయిన్ల పూడికతీతకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ అరుణ

కంకిపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జే అరుణ సూచించారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో తడి చెత్త, పొడి చెత్తపై శుక్రవారం గృహ సందర్శన చేశారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త వేరు చేస్తున్న విధానంపై గృహిణులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్త సేకరణపై అవగాహన కల్పించారా? లేదా? అని అడిగారు. డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ చెత్త సేకరణ సమర్థంగా జరగాలని అధికారులను ఆదేశించారు. తడి, పొడి చెత్త వేరు వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చెత్త సేకరణను విస్మరిస్తే కఠిన చర్యలు ఉం



తడి, పొడి చెత్త సేకరణపై వివరాలు తెలుసుకుంటున్న జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ అరుణ

టాయన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవని సూచించారు. పర్యటనలో ఈఓపీఆర్డీ కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన అవసరం

గన్నవరం: ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన పెంపొందించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం. సునీల్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సునీల్ మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల వాతావరణంతో పాటు భూమికి నష్టం కలుగుతుందన్నారు. అంతేకాకుండా పంట దిగుబడుల్లో పురుగు మందు అవశేషాల వల్ల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రకృతి సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీల గురించి రైతులకు వివరించాలని చెప్పారు. రైతులు ప్రకృతి సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివరావు, ట్రైనర్ సులోచన, శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

కంకిపాడు: ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి డీ శ్రీకర్ అన్నారు. కంకిపాడు పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక, పీఎండీఎస్-2025 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలకు ప్రత్యామ్నాయంగా పీఎండీఎస్ కిట్లు అందుబాటులోకి తేనున్నారని, మొక్కకు అవసరమైన అన్ని రకాల పోషకాలు ఈ కిట్టు ద్వారా చేకూరుతాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా డీపీఎం కే పార్థసారథి, మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్, డ్వాక్రా డీపీఎం నాయక్, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ సునీల్

అండగా ఉంటా.. అధైర్య పడొద్దు

కంకిపాడు: ఆపదలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులకు పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. కంకిపాడు పట్టణానికి చెందిన పైడిపల్లి చంద్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో తన సొంత ఖర్చులతో కానూరులోని నాగార్జున హాస్పిటల్‌లో వైద్య సేవలు అందించేలా చక్రవర్తి చర్యలు తీసుకున్నారు. వైద్య ఖర్చులు మొత్తం భరించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలు దండుగుల రవి, మరియబాబు, రమణమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని దేవభక్తుని చక్రవర్తి శుక్రవారం పరామర్శించారు. సనత్‌నగర్‌కు చెందిన షేక్ నూరుల్లా పెరలాసిస్ స్ట్రోక్ రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న చక్రవర్తి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు.



సనత్‌నగర్‌లో షేక్ నూరుల్లాను పరామర్శిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద సీపీఎం ధర్నా

పెనమలూరు: పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేస్తూ యనమలకుదురు సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల సీపీఎం కార్యదర్శి షేక్ ఖాశీం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు పెంచి ప్రజా సొమ్ము దోచుకుంటుందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు పెట్టి అన్ని వర్గాల ప్రజలను దోచుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రజలపై మోపిన భారం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఉప్పడ త్రిమూర్తి, ఎస్‌కే ఇబ్రహీం, మేక సత్యం, పిల్లి వసంతరావు, వాటిపల్లి శ్రీరాములు, భూలక్ష్మి, దానయ్య, కుమారి, వరలక్ష్మి, ఫాతీమా బేగం, కరీమున్నీసా పాల్గొన్నారు.

గన్నవరం: పెరిగిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇప్పటికే ఇందన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ. 32 వేల కోట్లు విద్యుత్ భారాలు వేసిన ప్రభుత్వం మరో రూ. 16 వేల కోట్లు చార్జీలు పెంచడానికి సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, నూరగాని సాంబశివరావు, బెజవాత తాతబ్బాయి, కైలే ఏసుదాసు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



యనమలకుదురు సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

ఘనంగా జుమాతుల్ విధా ప్రార్థనలు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జామియా మసీదులో రంజాన్ నెల చివరి శుక్రవారం ప్రార్థనలు (జుమాతుల్ విధా) ఘనంగా నిర్వహించారు. మసీద్ ఇమాం ఇక్బాల్ భక్తులకు సందేశమిస్తూ రంజాన్ మాసానికి చివరి శుక్రవారం వీడ్కోలు పలికేదిగా భావిస్తారని తెలిపారు. రంజాన్ మాసంలో చేసిన పుణ్యకార్యాలు మన జీవితాల్లో అధిక ఫలాలు ఇస్తాయన్నారు. మహ్మద్ ప్రవక్త తన బోధనల్లో ఈ శుక్రవారం ప్రతి ముస్లిం తప్పనిసరిగా నమాజ్ చేయాలని స్పష్టం చేశారన్నారు. దాన ధర్మాలు అధికంగా చేసి అల్లా కృపకు పాత్రులు కావాలని సూచించారు. మసీద్ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.



ముస్తాబాద జామియా మసీద్‌లో ప్రార్థనలు